ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
శనివారం, 26 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 39 | పేజీలు: 4 వెల: 5




# దేశమంతా తుపాను!

## కేరళ నుంచే దేశ రాజకీయ మార్పు మొదలు

- ఆ గాలి దేశమంతా తుపానుగా మారాలి
- రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడటమే నా లక్ష్యం
- ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- సంఘ్ పరివార్ దేశాన్ని విభజిస్తోందని విమర్శ
- గాంధీ పరివార్ భారత ఐక్యతకు కృషి చేస్తోందన్న సీఎం
- ప్రజాస్వామ్యం, ఓటు హక్కును కాపాడాలని పిలుపు



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** కేరళ నుంచి మొదలైన రాజకీయ గాలి దేశమంతా తుపానుగా మారాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశ రాజకీయాల్లో మార్పునకు కేరళ ఒక సంకేతమని వ్యాఖ్యానించారు. రుతుపవనాల కోసం వాతావరణ నిపుణులు కేరళ వైపు చూసినట్టే.. దేశ రాజకీయాలను అర్థం చేసుకునే విషయంలోనూ కేరళను చూడొచ్చన్నారు. కేరళలో మొదలైన మార్పు ప్రతి ఇంటికి, ప్రతి వీధికి, ప్రతి గ్రామానికి, ప్రతి నగరానికి, ప్రతి రాష్ట్రానికి చేరాలని ఆకాంక్షించారు. రాహుల్‌గాంధీని భారత ప్రధానమంత్రిగా చూడటమే తన ముందున్న ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. నిలంబూరులో శుక్రవారం జరిగిన ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేరళ రాజకీయాలకు దేశ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలను జాతీయ రాజకీయాలతో ముడిపెడుతూ ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. 1991లో కేరళలో కరుణాకరన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయ్యారని, 1996లో కేరళలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చిన

........(తరువాయి 2లో)

- దానం నాగేందర్ చుట్టూనే కాంగ్రెస్ కసరత్తు
- సాయికిరణ్ యాదవ్ పేరుపై బీఆర్ఎస్‌లో చర్చ
- చింతల రామచంద్రారెడ్డి వైపు బీజేపీ చూపు
- ఎస్ఐఆర్‌తో మారిన ఓటరు జాబితా లెక్కలు..
- మారనున్న బలాబలాలు
- బీసీ సమీకరణాలపై పార్టీల ప్రత్యేక దృష్టి..!
- బూత్‌ల వారీగా వ్యూహాలకు పదును

> ఖైరతాబాద్ ఉపఎన్నికకు రంగం సిద్ధమవుతున్న కొద్దీ హైదరాబాద్ రాజకీయాల్లో ఈ నియోజకవర్గం కేంద్రంగా మారుతోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేయడం, ఆ తర్వాత అనర్హత వేటు ఎదుర్కోవడం, చివరకు సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు అభ్యర్థుల ఎంపికతోపాటు నియోజకవర్గంలో తమ బలాబలాలపై లెక్కలు వేసుకుంటున్నాయి.

# ఉపపోరు.. ఉత్కంఠ

## ఖైరతాబాద్‌లో మూడు పార్టీల మోహరింపు!

**కాకతీయ,తెలంగాణ బ్యూరో:**

ఖైరతాబాద్ నుంచి 2018, 2023 ఎన్నికల్లో వరుసగా గెలిచిన దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ అభ్యర్థిత్వం విషయంలో ప్రధానంగా వినిపిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం తాను ఉపఎన్నికలో పోటీ చేయనున్నట్లు దానం సంకేతాలిచ్చినప్పటికీ.. ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారన్న విషయాన్ని మాత్రం స్పష్టంగా వెల్లడించలేదు. కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం ఆయనకే అవకాశం ఉంటుందన్న చర్చ కొనసాగుతోంది. పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**బీఆర్ఎస్‌లో అభ్యర్థి వేట**

దానం నాగేందర్ ప్రాతినిధ్యం వహించిన స్థానాన్ని తిరిగి తమ ఖాతాలో వేసుకునేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికపై దృష్టి పెట్టింది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు తలసాని సాయికిరణ్ యాదవ్ పేరు ప్రధానంగా చర్చలో ఉంది. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తాజా రాజకీయ పరిణామాలపై వచ్చిన నివేదికలు పేర్కొంటున్నాయి. అభ్యర్థి ఎవరన్న

........(తరువాయి 2లో)



# గోదావరి వరదను వృథా చేయొద్దు



- అన్ని మోటార్లు నడిపి రిజర్వాయర్లు నింపాలి
- కాళేశ్వరం జలాలను పూర్తిస్థాయిలో వినియోగించాలి
- మల్లన్నసాగర్ సహా రిజర్వాయర్లకు నీటిని తరలించాలి
- రైతులకు సాగునీరు.. హైదరాబాద్‌కు తాగునీరు అందించాలి
- బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** గోదావరిలో భారీగా వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో ఆ జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా తక్షణమే అన్ని మోటార్లు నడిపి రిజర్వాయర్లను నింపాలని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గోదావరి వరద జలాలను ఒడిసిపట్టి కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను నింపితే రైతులకు భారీ ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాశారు. గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థను నిర్మించిందని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా 141 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం గోదావరిలో భారీ వరద ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ.. ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. మరోవైపు పంటలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

**రిజర్వాయర్లకు నీటిని తరలించాలి**

మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని

........(తరువాయి 2లో)

# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి

- 69 అడుగుల పంచముఖ సంకటహరుడి నిమజ్జనం పూర్తి
- క్రేన్ నంబర్ 4 వద్ద ముగిసిన నిమజ్జన ప్రక్రియ
- భక్తులతో కిక్కిరిసిన హుస్సేన్‌సాగర్ పరిసరాలు
- డప్పు చప్పుళ్లు.. తీన్మార్ నృత్యాలతో మార్మోగిన ఎన్టీఆర్ మార్గ్
- భారీ భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక



**కాకతీయ, హైదరాబాద్ :** ఖైరతాబాద్ మహాగణపతి గంగమ్మ ఒడికి చేరాడు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్ద 69 అడుగుల పంచముఖ సంకటహర మహాగణపతి నిమజ్జన ప్రక్రియ పూర్తయింది. బడా గణేష్ నిమజ్జనాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులతో హుస్సేన్‌సాగర్ పరిసరాలు కిక్కిరిశాయి. మహాగణపతి నిమజ్జనం సమయంలో బైబై గణేశా

........(తరువాయి 2లో)

- అసైన్డ్, భూదాన్, సీలింగ్ భూముల లెక్క తేల్చేలా ఆదేశం
- మల్లన్నసాగర్, మిడ్‌మానేరు భూసేకరణపైనా దర్యాప్తు
- ధరణి మాడ్యూళ్ల దుర్వినియోగంపైనా విచారణ
- ఐదు జిల్లాల్లో క్షేత్రస్థాయికి ప్రత్యేక బృందం



# కేటీఆర్, హరీశ్‌రావు భూములపై ఆరా

## కేసీఆర్ కుటుంబ భూములపైనా కమిటీ విచారణ

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో భూ వ్యవహారాలపై రాజకీయ దుమారం మరింత ముదురుతోంది. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు.. భూ అక్రమాలు, ప్రభుత్వ భూముల దుర్వినియోగం, ఆక్రమణలు, భూ రికార్డుల వ్యవహారాలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు జారీ చేసిన జీవో 134లో మొత్తం 16 అంశాలను విచారణ పరిధిలోకి తీసుకొచ్చారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులకు సంబంధించిన భూముల వ్యవహారాలూ ఇందులో ఉన్నాయి. అయితే ఇవన్నీ విచారణకు ప్రభుత్వం పేర్కొన్న అంశాలు, ఆరోపణలు మాత్రమే.. అక్రమాలు జరిగినట్లు తుది నిర్ధారణ కాలేదు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని ఎర్రవల్లి, మర్కూక్, శివారు వెంకటాపూర్ ప్రాంతాల్లో మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, భాగస్వాములకు సంబంధించిన భూములపై కమిటీ పరిశీలన చేయనుంది. భూముల స్వభావం, యాజమాన్య హక్కులు, రికార్డులు, లావాదేవీలు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్న అంశాలను పరిశీలించనున్నారు. ప్రభుత్వ భూములు లేదా ఇతర ప్రత్యేక కేటగిరీ భూములు ప్రైవేటు ఆధీనంలోకి వెళ్లాయా అనే అంశంపైనా రికార్డుల ఆధారంగా ఆరా తీయనున్నారు.

**హరీశ్ భూములపైనా ఆరా**

మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు, భాగస్వాములకు సంబంధించిన భూములూ విచారణ పరిధిలోకి వచ్చాయి. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచలోని రంగనాయక సాగర్ జలాశయ పరిధిలోని భూములతో పాటు.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ ప్రాంతంలోని భూములపై కూడా పరిశీలన జరగనుంది. భూముల రికార్డులు, రిజిస్ట్రేషన్లు, వాటి స్వభావం తదితర అంశాలను కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. మాజీ మంత్రి కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, భాగస్వాములు, శతభిష అగ్రో తదితర సంస్థలు, వ్యక్తులకు సంబంధించిన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ ప్రాంతంలోని భూములనూ

........(తరువాయి 2లో)

# మంత్రుల చుట్టూ.. 'నాన్‌లోకల్' వలయం!

- లోకల్ క్యాడర్‌కు అందనంత దూరంగా మినిస్టర్లు
- అన్‌ప్రియారిటీగా మారుతున్న ఖమ్మం నేతలు.. బయటివారికే పెద్దపీట!
- గెలిపించిన వాళ్లకు గేట్లు.. కొత్తగా వచ్చినవాళ్లకు పలుకుబడి!
- అధికారుల వద్దా వారిదే హవా.. భూ వ్యవహారాల్లోనూ జోక్యం!!
- లోకల్ లీడర్లలో మంట.. మంత్రుల తీరుపై అంతర్గత అసంతృప్తి



3



# కొత్త పత్తి కొనుగోళ్లకు శ్రీకారం

- వరంగల్ మార్కెట్ యార్డులో తొలి బస్తాకు రూ.8775 ధర
- ఎం.వి.తండా రైతు జి.రమణకు సన్మానం
- మార్కెట్ యార్డును పరిశీలించిన సీపీ ఎన్.శ్వేత

3

# గెలిచినప్పుడు ఒక మాట.. ఓడినప్పుడు మరో మాటా?

- కాంగ్రెస్ గెలిచినప్పుడు ఈసీపై నమ్మకం.. ఓడితే విమర్శలా?
- ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం కొనసాగించాలి
- పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలి
- ఎస్ఐఆర్‌పై ఆధారాలతో అభ్యంతరాలు చెప్పాలి
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

2



ఉత్తరం కాకతీయ WWW.KAKATIYANEWS.COM

# ఉపపోరు..ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

దానితోపాటు స్థానిక నాయకత్వాన్ని ఏక తాటిపైకి తీసుకురావడం, డివిజన్, బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయడం పైనా బీఆర్ఎస్ దృష్టి సారిస్తోంది. ఖైరతాబాద్‌లో గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన చింతల రామచంద్రారెడ్డి పేరు బీజేపీ అభ్యర్థిత్వానికి ప్రధానంగా వినిపిస్తోంది. 2014లో ఈ నియోజకవర్గం నుంచి ఆయన గెలిచారు. దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో న్యాయపోరాటం చేసిన నాయకుల్లో చింతల కూడా ఉండటంతో నియోజకవర్గంలో ఆయన చురుకుదనం కొనసాగుతోంది. పార్టీ స్థాయిలో అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం రావాల్సి ఉన్నప్పటికీ.. చింతల పేరు చర్చలో ముందుంది.

**ఓటర్ల లెక్కల్లో భారీ మార్పు**

ఉపఎన్నికకు ముందు ఓటర్ల జాబితా సవరణ కీలకంగా మారింది. 2026 ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ అనంతరం ఖైరతాబాద్‌లో ఓటర్ల సంఖ్య గతంలో ఉన్న 2.68 లక్షల నుంచి సుమారు 1.86 లక్షలకు తగ్గినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. తుది జాబితా నవంబర్ 9న వెలువడనుంది. అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించనున్నారు. తుది జాబితా వచ్చిన తర్వాతే ప్రతి పార్టీకి తమ బూత్‌ల వారీగా ఓటర్ల వాస్తవ లెక్కపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఖైరతాబాద్ సామాజిక సమీకరణాలు కూడా ఉపఎన్నికలో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ ఓటర్లు గణనీయంగా ఉన్న ప్రాంతాలతోపాటు రెడ్డి సామాజికవర్గానికి చెందిన 30 వేలకు పైగా ఓట్లు ఉన్నట్లు తాజా విశ్లేషణలు పేర్కొంటున్నాయి. దీంతో అభ్యర్థుల సామాజిక నేపథ్యం, స్థానికంగా ఉన్న సంబంధాలు, డివిజన్‌ల వారీగా నాయకుల ప్రభావం వంటి అంశాలపై పార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి.

**బూత్‌ల వారీగా వ్యూహాలకు పదును**

అభ్యర్థుల ఎంపికతోపాటు బూత్ స్థాయి యంత్రాంగంపై మూడు పార్టీలు దృష్టి పెడుతున్నాయి. డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించడం, ఇంటింటి ప్రచారం, స్థానిక సమావేశాలు, సోషల్ మీడియా ప్రచారం వంటి అంశాలపై ప్రణాళికలు రూపొందుతున్నాయి. ఓటర్ల జాబితా తుది రూపు దాల్చిన తర్వాత ప్రతి పార్టీ తనకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలు, బలహీనంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉంది. దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ రాజకీయ సమీకరణం ఒక్కసారిగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ 67,368 ఓట్లు సాధించి విజయం సాధించగా.. కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డికి 45,358, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డికి 38,094 ఓట్లు వచ్చాయి. ఈ గణాంకాలే ఇప్పుడు మూడు పార్టీల వ్యూహాలకు ప్రాథమిక ఆధారంగా మారుతున్నాయి.

**లోక్‌సభ ఫలితాల ప్రభావం**

2024 లోక్‌సభ ఎన్నికల్లో ఖైరతాబాద్ పరిధిలో బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డికి ఆధిక్యం రావడం కూడా తాజా రాజకీయ లెక్కల్లో చర్చకు వస్తోంది. అయితే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ పరిస్థితులు వేర్వేరుగా ఉండటంతో ఆ గణాంకాలను మాత్రమే ఆధారంగా చేసుకుని ఉపఎన్నికపై తుది అంచనాలు వేయలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం పార్టీలు తమ సంస్థాగత బలాన్ని బూత్‌ల స్థాయిలో పరీక్షించుకునే పనిలో ఉన్నాయి. ఖైరతాబాద్‌లో ఉన్న ఉన్నత ఆదాయ వర్గాల కాలనీలతోపాటు మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాల నివాస ప్రాంతాలు కూడా ఉన్నాయి. జూబ్లీహిల్స్ రోడ్లు, ఫిలింనగర్‌తో పాటు అనేక మధ్యతరగతి కాలనీలు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. స్థానిక మౌలిక వసతులు, రహదారులు, పారిశుధ్యం, ట్రాఫిక్, పట్టణ సౌకర్యాలు, యువతకు సంబంధించిన అంశాలు ప్రచారంలో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది.

**తుది జాబితా తర్వాతే మరింత స్పష్టత**

ప్రస్తుతం అభ్యర్థుల పేర్లు చర్చ దశలోనే ఉన్నాయి. కాంగ్రెస్‌లో దానం నాగేందర్ పేరు, బీఆర్ఎస్‌లో తలసాని సాయికిరణ్ యాదవ్ తదితర పేర్లు, బీజేపీలో చింతల రామచంద్రారెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అధికారిక ప్రకటనలు వచ్చిన తర్వాతే అభ్యర్థుల విషయంలో తుది స్పష్టత రానుంది. మరోవైపు నవంబర్ 9న వెలువడే తుది ఓటర్ల జాబితా ఉపఎన్నిక రాజకీయ లెక్కలకు మరో కీలక ఆధారంగా మారనుంది. దీంతో ఖైరతాబాద్‌లో ప్రస్తుతం అభ్యర్థుల ఎంపిక, ఓటర్ల లెక్కలు, బూత్ స్థాయి బలాబలాల చుట్టూనే మూడు పార్టీల కసరత్తు సాగుతోంది.

# భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి

- ఉదయం 9 గంటలకే గ్రామాలకు చేరుకుని సర్వే ప్రారంభించాలి
- అధికారుల సమన్వయంతో పకడ్బందీగా పూర్తి చేయాలి
- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి

**కాకతీయ, హన్మకొండ :** జిల్లాలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి అధికారులను ఆదేశించారు. సర్వేలో ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భూముల రీ సర్వేపై సర్వేయర్లు, లైసెన్సుడ్ సర్వేయర్లు, తహసీల్దార్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ రీ సర్వే చేపడుతున్న గ్రామాలకు సర్వేయర్లు, జీపీవోలు ఉదయం 9 గంటలకే చేరుకుని సర్వే ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సర్వేయర్లు, జీపీవోలు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేసి రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ సర్వే పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

# ప్రణాళిక లేని కట్టడాలతో మునకలో వరంగల్

- రెండో రాజధాని సౌందర్యానికి అక్రమ నిర్మాణాల గ్రహణం
- నిబంధనలు పాటించేవాడే బలి?





**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం, రెండో రాజధానిగా గుర్తింపు పొందిన వరంగల్ లో అక్రమ నిర్మాణాలు నగర సౌందర్యాన్ని మసకబారుస్తున్నాయి. ప్రణాళికాబద్ధ అభివృద్ధికి ఇవి పెద్ద అడ్డంకిగా మారుతున్నాయి. నగరాభివృద్ధి నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలకు తప్పనిసరిగా సెట్ బ్యాక్ ఉండాలి. దీనివల్ల డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ సౌకర్యాలు, రోడ్డు విస్తరణ వంటి ప్రజా మౌలిక వసతులు కల్పించడం సులభమవుతుంది. కానీ నాని గార్డెన్స్ సమీపంలోని నిర్మాణంలో ఈ నిబంధనలను పూర్తిగా విస్మరించారు.

**వర్షా కాలంలో నరకయాతన..**

"ఇప్పటికే వర్షాకాలంలో నీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు మొత్తం భవనాలతో ఆక్రమిస్తే మురుగునీటి పారుదల పూర్తిగా దెబ్బతింటుంది. డ్రైనేజీ కాలువలు ఎక్కడ నిర్మిస్తారు?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు విస్తరణ అవసరం వచ్చినా ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పాటించే సామాన్యుడు అనుమతుల కోసం కార్పొరేషన్ చుట్టూ నెలల తరబడి తిరుగుతుంటే, నిబంధనలు ఉల్లంఘించే వారికి మాత్రం ఎలాంటి అడ్డంకులు లేకపోవడం గమనార్హం. నిబంధనలు పాటించే వారికంటే ఉల్లంఘించే వారికే ప్రాధాన్యం లభిస్తోందనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోతోంది.

**ప్రజల డిమాండ్ ఏంటి?**

ఉరుసు గుట్ట సమీపంలోని శ్రీలక్ష్మి కార్ జోన్ పక్కనే జరుగుతున్న బారి నిర్మాణాన్ని వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రోడ్డు ఆక్రమణ జరిగి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ ను కోరుతున్నారు. నగరంలో జరుగుతున్న అన్ని అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా రహదారులను పరిరక్షించడం, భవిష్యత్ తరాలకు ప్రణాళికాబద్ధమైన నగరాన్ని అందించడం అధికారుల బాధ్యత అని వారు గుర్తు చేస్తున్నారు.

# కేరళ గాలి.. దేశమంతా తుపాను!

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ఢిల్లీలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయిందని గుర్తుచేశారు. 2001లో ఏకే ఆంటోనీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2004లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ప్రస్తావించారు. 2026లో కేరళలో కాంగ్రెస్ మళ్లీ విజయం సాధించడంతో కొత్త రాజకీయ గాలి మొదలైందని అన్నారు. ఈ గాలి దేశమంతా తుపానుగా మారాలని పిలుపునిచ్చారు.

**'రాహుల్‌ను ప్రధానిగా చూడటమే లక్ష్యం'**

తనకు వ్యక్తిగత రాజకీయ ఆశలు లేవని రేవంత్‌రెడ్డి అన్నారు. 2006లో క్షేత్రస్థాయి నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వంటి వివిధ పదవులను చేపట్టానని గుర్తుచేశారు. ఇక తన ముందున్న ఏకైక లక్ష్యం రాహుల్‌గాంధీని భారత ప్రధానమంత్రిగా చూడటమేనని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు అధికారాన్ని, పదవులను త్యజించారని వ్యాఖ్యానించారు. రాహుల్, ప్రియాంకగాంధీలు కేరళ నుంచి పార్లమెంట్‌కు ఎన్నిక కావడం తనకు ఈ రాష్ట్రంతో మరింత అనుబంధాన్ని కల్పించిందన్నారు.

**'సంఘ్ పరివార్ దేశాన్ని విభజిస్తోంది'**

సంఘ్ పరివార్ సారథ్యంలో బీజేపీ దేశాన్ని మతం పేరుతో విభజిస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. గాంధీ పరివార్ మాత్రం భారత ఐక్యతకు కృషి చేస్తోందని వ్యాఖ్యానించారు. భారత ఆత్మగా తాను అభివర్ణించిన 'ఐడియా ఆఫ్ ఇండియా' కోసం రాహుల్‌గాంధీ దేశమంతా తిరుగుతున్నారని అన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ జీవితాంతం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేశారని గుర్తుచేస్తూ.. ఆ విలువలను కాపాడటమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, ఎన్నికల గుర్తుల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతున్నాయంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఓటు హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడేందుకు రాహుల్‌గాంధీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**అవార్డుతో రేవంత్‌కు గుర్తింపు**

ఇదే కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి 'ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డును స్వీకరించారు. దివంగత కేరళ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. రైతులు, వెనుకబడిన వర్గాలు, ఇతర సామాజిక వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, రేవంత్‌రెడ్డి నాయకత్వం, ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయన నిబద్ధతను గుర్తిస్తూ ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ తెలిపింది. అవార్డు కింద రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారు. ఆర్యదాన్ ముహమ్మద్ పేరుతో ఏర్పాటు చేసిన పురస్కారాన్ని అందుకోవడం తనకు ఎంతో గౌరవంగా ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. కేరళ వెలుపల నుంచి ఈ అవార్డుకు ఎంపికైన తొలి వ్యక్తిగా నిలవడం మరింత ప్రత్యేకమని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తగా, రాహుల్‌గాంధీ నాయకత్వంలోని బృందంలో ఒక కార్యకర్తగా ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్నానని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర సమయంలో, కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ కేరళకు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రతిసారీ కేరళ ప్రజలు తనకు ఆత్మీయ స్వాగతం పలికారని అన్నారు.

**తెలంగాణ నుంచి జాతీయ రాజకీయాల వైపు**

కేరళ వేదికగా రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో రాష్ట్ర రాజకీయాలకు మించి జాతీయ రాజకీయాల ప్రస్తావన ప్రధానంగా నిలిచింది. కాంగ్రెస్ నాయకత్వం, రాహుల్‌గాంధీ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఓటు హక్కు వంటి అంశాలను ప్రస్తావిస్తూ తన రాజకీయ లక్ష్యాన్ని ఆయన బహిరంగంగా వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్‌రెడ్డి జాతీయ రాజకీయాలపై చేసిన తాజా వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయ వర్గాల్లోనూ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకవైపు ఆర్యదాన్ ముహమ్మద్ పేరుతో ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోగా.. మరోవైపు కేరళ వేదికగా దేశ రాజకీయాలపై తన రాజకీయ సందేశాన్ని బలంగా వినిపించారు.

# ఆధునిక సాంకేతికతతో నూతన గ్రంథాలయం

- విద్యార్థులు, యువతకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పించాలి
- సోషల్ మీడియాను విజ్ఞానం, నైపుణ్యాభివృద్ధికి వినియోగించాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



**కాకతీయ, నిజామాబాద్ :** పట్టణంలో నిర్మించనున్న నూతన గ్రంథాలయాన్ని ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా అభివృద్ధి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు, యువతకు ఉపయోగపడేలా ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన పుస్తకాలు, డిజిటల్ వనరులు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో అవసరమని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. పుస్తకాలు జ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు ఆలోచనా విధానాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడంతో ప్రపంచం అరచేతిలోకి వచ్చిందని, ఈ నేపథ్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పిన విషయాలు మరింత ప్రాసంగికంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

**గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలి**

యువతపై సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో దాని వినియోగంలో విచక్షణ అవసరమని మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. సోషల్ మీడియాను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా విద్య, విజ్ఞానం, నైపుణ్యాభివృద్ధికి ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. యువతకు గ్రంథాలయాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకుని పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలకు సంబంధించిన సమాచారాన్ని గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు పొందేలా ప్రోత్సహించాలని అన్నారు. నూతన గ్రంథాలయం నిజామాబాద్ పట్టణంలోని విద్యార్థులు, యువతతోపాటు ప్రజలందరికీ విజ్ఞాన కేంద్రంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రంథాలయ నిర్వాహకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి

(మొదటిపేజీ తరువాయి)

అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. సెప్టెంబర్ 14 నుంచి సుమారు 11 రోజుల పాటు భక్తుల పూజలందుకున్న మహాగణపతి శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో మండపం నుంచి ఊరేగింపుగా బయలుదేరాడు. సుమారు 4 నుంచి 5 గంటల పాటు సాగిన శోభాయాత్రలో దేశ, విదేశాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. దీంతో హైదరాబాద్‌లో పండగ వాతావరణం నెలకొంది.

**డప్పు చప్పుళ్లు.. తీన్మార్ నృత్యాలు**

ఎన్టీఆర్ మార్గ్ డప్పు చప్పుళ్లు, తీన్మార్ నృత్యాలతో హోరెత్తింది. మహాగణపతి గంగమ్మ ఒడికి చేరే ఘట్టాన్ని చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. హుస్సేన్‌సాగర్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాంగ్ బూమ్ క్రేన్ ద్వారా నిమజ్జన ప్రక్రియను పూర్తి చేశారు. ఖైరతాబాద్ మహాగణపతితో పాటు నగరంలోని వేలాది గణేశ్ విగ్రహాలు హుస్సేన్‌సాగర్ వైపు తరలివచ్చాయి. ఒక్కొక్కటిగా విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. నిమజ్జనాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి భారీ భద్రత కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఖైరతాబాద్ బడా గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది.

# గోదావరి వరదను వృథా చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

తరలించాలని హరీశ్‌రావు కోరారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లోని రైతులకు సాగునీరు అందించడంతోపాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలను కూడా తీర్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కొండపోచమ్మసాగర్‌లో 15 టీఎంసీలకు గాను 6 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉందని పేర్కొన్నారు. అక్కడికీ నీటిని ఎత్తిపోసి యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం చేకూర్చాలని కోరారు. ఎల్లంపల్లి నుంచి నీటి ఎత్తిపోతలను ప్రారంభించి మిడ్‌మానేరు, సరస్వతి, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గంధమల్ల తదితర రిజర్వాయర్లను నింపాలని హరీశ్‌రావు సూచించారు. కాళేశ్వరం వ్యవస్థలోని మోటార్లను పూర్తిస్థాయిలో వినియోగిస్తే వరద జలాలను నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించకుండా వదిలేయడం వల్ల భవిష్యత్‌లో సాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

**రైతులకు ప్రయోజనం చేకూరాలి**

వర్షాకాలంలో గోదావరిలో వచ్చే వరద నీటిని నిల్వ చేసుకుంటే రిజర్వాయర్ల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని హరీశ్‌రావు తెలిపారు. గతంలో ప్రభుత్వాలు ప్రాజెక్టులు, రిజర్వాయర్లను నిర్మించిన ఉద్దేశం రైతులకు నీరు అందించడమేనని పేర్కొన్నారు. ప్రస్తుతం గోదావరి వరద జలాలు అందుబాటులో ఉన్నందున వాటిని ఎత్తిపోసి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు. అన్ని మోటార్లను నడిపి రిజర్వాయర్లను నింపాలని, రైతులకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలను పక్కనపెట్టి రైతు ప్రయోజనాల కోసం అందుబాటులో ఉన్న గోదావరి జలాలను వినియోగించాలని కోరారు. ప్రస్తుతం గోదావరి నదిలో వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని లేఖలో స్పష్టం చేశారు.

# గెలిచినప్పుడు ఒక మాట.. ఓడినప్పుడు మరో మాటా?

- కాంగ్రెస్ గెలిచినప్పుడు ఈసీపై నమ్మకం.. ఓడితే విమర్శలా?
- ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం కొనసాగించాలి
- పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలి
- ఎస్ఐఆర్‌పై ఆధారాలతో అభ్యంతరాలు చెప్పాలి
- కేంద్ర మంత్రి, బీజేపీ నేత జి.కిషన్‌రెడ్డి

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినప్పుడు ఒకలా, ఓడిపోయినప్పుడు మరోలా ఎన్నికల సంఘంపై మాట్లాడటం సరికాదని కేంద్ర మంత్రి, బీజేపీ నేత జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజాస్వామ్య వ్యవస్థలపై విశ్వాసం కొనసాగించాలని సూచించారు. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు వంటి రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ప్రజలు ఏ పార్టీకి ఓటు వేసినా, ఆ తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందని కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేల చేరికలపై ప్రశ్నలు లేవనెత్తారు. పార్టీ ఫిరాయింపులపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్.. తెలంగాణలో జరిగిన పరిణామాలపై కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఎస్ఐఆర్‌పై ఆధారాలతో అభ్యంతరాలు**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. ఎస్ఐఆర్ జరిగిన ప్రాంతాల్లో కాంగ్రెస్, ఇతర పార్టీలు కూడా విజయం సాధించాయని గుర్తుచేశారు. ఓటరు జాబితాల్లో తప్పులు ఉన్నాయని భావిస్తే ఎన్నికల సంఘం ముందు ఆధారాలతో అభ్యంతరాలు వ్యక్తం చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌లోనూ ఓటర్లకు జాబితాల్లో పేరు, వివరాల పరిశీలనతోపాటు అభ్యంతరాలు, ఫిర్యాదులకు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అని కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాలపై రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చని, అయితే ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం దెబ్బతినకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు, భిన్నాభిప్రాయాలకు ఎప్పుడూ చోటు ఉంటుందని, ఎన్నికల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. రాజకీయ విమర్శల కంటే ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.



# కేటీఆర్, హరీశ్‌రావు భూములపై ఆరా

(మొదటిపేజీ తరువాయి)

కమిటీ పరిధిలోకి తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పటికే రాజకీయంగా వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వ ఉత్తర్వులతో అధికారిక విచారణకు వెళ్లనుంది. రిజిస్ట్రేషన్ రికార్డులు, భూముల స్వభావం, లావాదేవీలు, సంబంధిత పత్రాలను పరిశీలించి వాస్తవాలను తేల్చే బాధ్యత కమిటీపై ఉంది.

**అసైన్డ్.. భూదాన్.. ఇనాం**

ప్రభుత్వం కేవలం రాజకీయ నాయకులకు సంబంధించిన భూములకే విచారణను పరిమితం చేయలేదు. అసైన్డ్, భూదాన్, సీలింగ్ మిగులు, జాగీర్, ఇనాం, అటవీ భూముల లావాదేవీలపైనా సమగ్ర పరిశీలనకు ఆదేశించింది. భూముల కొనుగోళ్లు, ఆక్రమణలు, రిజిస్ట్రేషన్లు నిబంధనలకు అనుగుణంగా జరిగాయా? ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లాయా? ప్రత్యేక కేటగిరీ భూముల స్వరూపం మార్చారా? వంటి అంశాలను కమిటీ పరిశీలించనుంది. మల్లన్నసాగర్ నిర్మాణంలో భాగంగా సిద్దిపేట జిల్లాలో జరిగిన భూసేకరణపైనా విచారణకు ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్. రామలింగారెడ్డి చేసిన ఫిర్యాదులో ప్రస్తావించిన అంశాల ఆధారంగా తొగుట మండలంలోని పల్లెపహాడ్, తుక్కాపూర్, ఏటిగడ్డ కిష్టాపూర్, రాంపూర్ ప్రాంతాల్లో జరిగిన భూసేకరణను పరిశీలించనున్నారు. భూముల స్వాధీనం, పరిహారం, రికార్డులు, నిబంధనల అమలు తదితర అంశాలను కమిటీ పరిశీలించనుంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే పి. రోహిత్‌రెడ్డికి సంబంధించిన అసైన్డ్ భూముల కొనుగోళ్లు, ఆక్రమణల ఆరోపణలపైనా విచారణ జరగనుంది. శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఇతరులకు సంబంధించిన ప్రభుత్వ భూముల కొనుగోలు, ఆక్రమణల ఆరోపణలు కూడా కమిటీ ముందున్నాయి. గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ భూముల వ్యవహారాన్నీ పరిశీలించనున్నారు. వట్టినాగులపల్లిలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఇతరులకు సంబంధించిన భూదాన్ భూముల కొనుగోళ్ల ఆరోపణలను కూడా విచారణ జాబితాలో చేర్చారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో జరిగిన భూదాన్ భూముల కొనుగోళ్లపైనా ఆరా తీయనున్నారు. భూదాన్ భూముల బదలాయింపులు, రిజిస్ట్రేషన్లు, సంబంధిత నిబంధనలు పాటించారా లేదా అన్నది కమిటీ పరిశీలించనుంది.

**జగదీశ్వర్‌రెడ్డి.. గంగీడ భూములు**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూరులో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, భాగస్వాములకు సంబంధించిన భూములపై కూడా విచారణ ఉంటుంది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గండీడ్‌లో కొన్ని సంస్థలు, వ్యక్తులకు సంబంధించిన భూముల వ్యవహారాలను ధరణి మాడ్యూళ్ల వినియోగం కోణంలో పరిశీలించనున్నారు. రికార్డుల్లో మార్పులు, లావాదేవీల ప్రక్రియ, నిబంధనల అమలును పరిశీలించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల కొనుగోళ్లతోపాటు తంగళ్లపల్లి, సిరిసిల్ల, సర్దార్‌పూర్, లక్ష్మీపూర్ తదితర గ్రామాల్లోని భూముల వ్యవహారాలను కమిటీ పరిశీలించనుంది. మధ్యమానేరు జలాశయం భూసేకరణలో పరిహారం, పునరావాస ప్యాకేజీలకు సంబంధించి అనుచిత లబ్ధి పొందారన్న ఆరోపణలపైనా విచారణ జరగనుంది. ఈ అంశంలో జోగినపల్లి రవీందర్‌రావు, జె. సౌమ్య పేర్లను ప్రభుత్వం ఉత్తర్వుల్లో ప్రస్తావించింది.

**ధరణి మాడ్యూళ్లపైనా కన్ను**

ధరణి పోర్టల్‌లోని మాడ్యూళ్ల దుర్వినియోగానికి సంబంధించిన వ్యవహారాలనూ కమిటీ విచారణ పరిధిలోకి తీసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గండీడ్ పరిధిలోని కొన్ని సంస్థలు, వ్యక్తులకు సంబంధించిన భూముల రికార్డులను ఈ కోణంలో పరిశీలించనున్నారు. భూ రికార్డుల మార్పులు, ఆన్‌లైన్ లావాదేవీలు, వాటికి సంబంధించిన అనుమతులు, అధికారిక ప్రక్రియను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించారా లేదా తేల్చనున్నారు. రంగారెడ్డి, సిద్దిపేట, మహబూబ్‌నగర్, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్ జిల్లాల్లో కమిటీ క్షేత్రస్థాయి విచారణ చేపట్టనుంది. సంబంధిత జిల్లా కలెక్టర్లు కమిటీలో సభ్యులుగా ఉంటారు. అవసరమైన రికార్డులు, పత్రాలు, డేటా, ఇతర సమాచారాన్ని సంబంధిత శాఖలు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. తుది నివేదికతోపాటు అంశాల తీవ్రతను బట్టి మధ్యంతర నివేదికలు కూడా సమర్పించవచ్చని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ. శ్రీదేవసేన కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతోపాటు సంబంధిత జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

**నివేదికపైనే అసలు ఉత్కంఠ**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటీ విచారణతో రాష్ట్ర భూ వ్యవహారాలు మరోసారి రాజకీయ కేంద్రబిందువుగా మారాయి. ముఖ్యంగా గత ప్రభుత్వంలోని కీలక నేతలు, వారి కుటుంబ సభ్యులు, భాగస్వాములు, మాజీ ప్రజాప్రతినిధులకు సంబంధించిన భూముల అంశాలు ఉత్తర్వుల్లో ప్రస్తావనకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే కమిటీ విచారణ పూర్తయ్యే వరకు ఉత్తర్వుల్లో పేర్కొన్న అంశాలను అక్రమాలుగా పరిగణించలేం. భూముల అసలు స్వరూపం, లావాదేవీల చట్టబద్ధత, నిబంధనల ఉల్లంఘన, బాధ్యులెవరు అన్నది అధికారిక విచారణ, రికార్డుల పరిశీలన, తుది నివేదికలోనే తేలాల్సి ఉంది.

# అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం అభినందనీయం

- అర్హులైన దళితులకు భూమి పంపిణీ చేయాలి
- పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించాలి
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కృతజ్ఞతలు



**కాకతీయ, హనుమకొండ :** అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం, అర్హులైన దళితులకు భూమి పంపిణీ చేయాలనే నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాదిగ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం హనుమకొండ అంబేద్కర్ సర్కిల్‌లో మాదిగ హక్కుల దండోరా, దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సీఎం నిర్ణయాన్ని స్వాగతించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం దళిత కుటుంబాల భూ హక్కులు, ఆత్మగౌరవం, ఆర్థిక భద్రతకు కీలకమన్నారు. గతంలో ఏర్పడిన భూ సమస్యలను సమగ్రంగా పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. అన్యాయంగా ఇతరుల పేర్లకు మారిన భూములను అసలు హక్కుదారులకు తిరిగి అందించాలని విజ్ఞప్తి చేశారు. అసైన్‌మెంట్ చట్టం-1977 ప్రకారం తనఖా రుణాలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ, రాజేందర్, సురేష్‌బాబూరావు, చుంచు రాజేందర్, మాదాసు సురేష్, మన్నే బాబురావు, రామచందర్, కేడేల ప్రసాద్, స్వామి, మందవీరస్వామి, రవీందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో ఘనంగా ఎన్ఎస్ఎస్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

- పూర్వ వలంటీర్లు, అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం
- 50 ఏళ్ల సేవలను గుర్తుచేసుకున్న పూర్వ వాలంటీర్లు
- ఎన్ఐసీ పూర్వ వాలంటీర్ పత్తేం శ్రీనివాస్‌కు సన్మానం



**కాకతీయ, చిగురుమామిడి:** వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ 50 ఏళ్ల గోల్డెన్ జూబ్లీ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా ఎస్ఆర్ఆర్ కళాశాలకు చెందిన 2005 ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో పాటు చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన ఎన్ఐసీ పూర్వ వాలంటీర్ పత్తేం శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. మాజీ వాలంటీర్లు, యూత్ అవార్డు గ్రహీతలు, నేషనల్ అవార్డీలు, ఎన్ఎస్ఎస్ ఎన్ఐసీ క్యాంపుల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఒకే వేదికపైకి చేరారు. ఎన్ఎస్ఎస్ 50 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని విద్యార్థులు వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, కేయూ వైస్‌చాన్స్‌లర్ కె. ప్రతాప్‌రెడ్డి, ప్రొఫెసర్ వి. రామచంద్ర, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రొఫెసర్లు కిష్టయ్య, తాళ్లపల్లి మనోహర్, సురేష్‌లాల్, రమణ, ఆర్. ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ యాదగిరి, ఎస్ఆర్ఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీ, జ్యోతి, ఎన్ఎస్ఎస్ అవార్డీలు కొండ రవి, కళింగ శేఖర్, ఏ. కిరణ్, అలువాల విష్ణు, రవిప్రసాద్, మధు, పత్తేం శ్రీనివాస్, మాజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు జీవన్, రాజమౌళి, వడ్లకొండ అనిల్, బుర్ర సతీష్, నాగరాజు, ప్రవీణ్, అశోక్, శ్రీనివాస్, ఓరుగంటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు కన్న కల నేటితో నెరవేరింది

- రావిరాల చెరువు మత్తడి పోస్తుండటంతో రైతుల్లో ఆనందం
- గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు
- నెల్లికుదురు సర్పంచ్ కత్తుల కళ్యాణి హర్షం



**కాకతీయ, నెల్లికుదురు :** రావిరాల చెరువు మత్తడి పోస్తుండటంతో రైతు కన్న కల నేటితో నెరవేరిందని సర్పంచ్ కత్తుల కళ్యాణి అన్నారు. శుక్రవారం చెరువు నుంచి నీరు మత్తడి దూకుతూ వాగులు, వంకల మీదుగా ప్రవహించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. మూడేళ్ల క్రితం రావిరాల పెద్ద చెరువు కట్ట అకాల వరదలకు తెగిపోవడంతో గ్రామంలో వ్యవసాయం దెబ్బతిందని, బావులు ఎండిపోయి బీడు భూములు దర్శనమిచ్చాయని గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ చొరవతో కట్ట మరమ్మతులు చేపట్టడంతో చెరువు నిండు కుండలా మారి మత్తడి పోస్తోందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కత్తుల కళ్యాణి, నాయకులు కత్తుల యాకాంతం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అరే తరుణ్, వార్డు సభ్యులు తాళ్లపల్లి సాగర్, ఆకుల సుప్రియకృష్ణ, గుండెపాక స్వప్న మల్లేష్, కడారి శ్రీకాంత్, కడారి వెంకటమల్లు, పబ్బ సూర్యప్రసాద్, కత్తుల కుమార్, రాసా అనూష, యాకిరెడ్డి, అక్కర నాగరాణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చందుర్తిలో బెల్ట్ దందా జోరు

- ఎక్సైజ్ ఉక్కుపాదం ఎక్కడ?
- దాడులు చేస్తున్నా.. అక్రమ మద్యం ఆగేదెప్పుడు?
- బంద్ వేళ అడ్డగోలు ధరలతో అమ్మకాలా?
- సరఫరా మూలాలపై ఎక్సైజ్ నజర్ ఎక్కడ?



**కాకతీయ, చందుర్తి :** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో బెల్ట్ షాపుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో యథేచ్ఛగా అక్రమ మద్యం విక్రయాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో వీధికో బెల్ట్ షాప్ ఉన్నట్లు స్థానికులు చెబుతుండగా.. కిరాణా దుకాణాలు, చికెన్ సెంటర్లలోనూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. వినాయక చవితి సందర్భంగా మద్యం దుకాణాలకు డ్రైడే నిబంధనలు అమల్లో ఉన్న సమయంలోనూ కొందరు బెల్ట్ షాపుల నిర్వాహకులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బీర్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు, క్వార్టర్ సీసాపై రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. అయితే వీటికి అధికారిక నిర్ధారణ అవసరం. కొన్ని గ్రామాల్లో నాలుగైదు బెల్ట్ షాపులు నడుస్తున్నాయనే స్థానికుల ఆరోపణలున్నాయి. ఎక్సైజ్ అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు, దాడులు చేస్తున్నా అక్రమ మద్యం విక్రయాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న మూలాలపైనా దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటివరకు ఎన్ని దాడులు జరిగాయి? ఎంత మద్యం స్వాధీనం చేసుకున్నారు? ఎన్ని కేసులు నమోదయ్యాయి? అనే వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించాల్సి ఉంది. అధికారులపై 'మామూళ్ల' ఆరోపణలు కూడా వినిపిస్తున్నప్పటికీ వాటికి ఆధారాలు, అధికారిక నిర్ధారణ అవసరం. ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

# వరంగల్ అభివృద్ధికి నిధులివ్వండి

- కాకతీయ వర్సిటీకి పీఎం–ఉషా నిధులు తేవాలి
- పురావస్తు మ్యూజియానికి రూ.10 కోట్లు మంజూరు చేయాలి
- నైలిట్, సీఐటీడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం కావాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య
- కేంద్రంతో మాట్లాడి నిధులు తీసుకురావాలని విజ్ఞప్తి



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** వరంగల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు సంస్థలు, నిధులను వరంగల్‌కు తీసుకురావాలని సీఎంను కోరారు. కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధులు, వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి రూ.10 కోట్లు, నైలిట్, సీఐటీడీ కేంద్రాల ఏర్పాటు, పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం కోసం కేంద్రంతో చర్చించాలని విజ్ఞప్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి పీఎం-ఉషా పథకం కింద ప్రతిపాదించిన నిధులను కేంద్రం నుంచి త్వరగా మంజూరు చేసి విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కావ్య కోరారు. విద్య, పరిశోధన, మౌలిక వసతులను బలోపేతం చేయడంతోపాటు విద్యార్థులు, పరిశోధకులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు.

**మ్యూజియానికి రూ.10 కోట్లు**

వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించాలని కోరారు. 1991లో ఏర్పాటైన పాత మ్యూజియం భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త భవన నిర్మాణం 2023 మేలో పూర్తయినా కళాఖండాల తరలింపు, పరిరక్షణ, ప్రదర్శన, భద్రత, వాతావరణ నియంత్రణ వంటి పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. వరంగల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలిట్) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కావ్య కోరారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ రంగాల్లో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు శిక్షణ, ధ్రువపత్రాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సీఐటీడీ కేంద్రం ఏర్పాటుతో ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు ఎంఎస్ఎంఈలకు ఆధునిక సాంకేతిక శిక్షణ, సాంకేతిక సహకారం అందుతుందని పేర్కొన్నారు.

**పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ కేంద్రం కావాలి**

వరంగల్‌లో ప్రస్తుతం ఉన్న పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం స్థానంలో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. తత్కాల్ పాస్‌పోర్ట్ సేవల కోసం కరీంనగర్, సికింద్రాబాద్ వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వరంగల్-హనుమకొండ-కాజీపేట త్రినగర ప్రాంతంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రయోజనం చేకూరేలా కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ ప్రాంత విద్యార్థులు, యువత, పరిశోధకులు, ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కాకతీయుల చారిత్రక వారసత్వ పరిరక్షణకు కేంద్ర సహకారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కావ్య కోరారు. ఆమెతో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కావ్య ప్రస్తావించిన అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖలతో చర్చించి కేంద్రంతో సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

# మంత్రుల చుట్టూ.. 'నాన్‌లోకల్' వలయం!

- లోకల్ క్యాడర్‌కు అందనంత దూరంగా మినిస్టర్లు
- అన్‌ప్రియారిటీగా మారుతున్న ఖమ్మం నేతలు.. బయటివారికే పెద్దపీట!
- గెలిపించిన వాళ్లకు గేట్లు.. కొత్తగా వచ్చినవాళ్లకు పలుకుబడి!
- అధికారుల వద్దా వారిదే హవా.. భూ వ్యవహారాల్లోనూ జోక్యం!!
- లోకల్ లీడర్లలో మంట.. మంత్రుల తీరుపై అంతర్గత అసంతృప్తి

**కాకతీయ, ఖమ్మం బ్యూరో:** ఎన్నికల్లో భుజం భుజం కలిపి పనిచేసిన స్థానిక క్యాడర్ ఒకవైపు.. అధికారం వచ్చాక మంత్రుల చుట్టూ చేరిన 'నాన్‌లోకల్' నేతలు మరోవైపు! ఖమ్మం జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన స్థానిక నాయకులు, కార్యకర్తలు మాత్రం మంత్రులను కలవడానికే ఇబ్బందులు పడుతుండగా.. నియోజకవర్గంతో పెద్దగా సంబంధం లేని కొందరు నేతలు మంత్రుల చుట్టూ చక్కర్లు కొడుతూ అధికారుల వద్ద తమ పలుకుబడిని పెంచుకుంటున్నారనే చర్చ సాగుతోంది. ఎన్నికల సమయంలో అవసరమైన లోకల్ క్యాడర్.. ఇప్పుడు అధికార వ్యవహారాల్లో ఎందుకు కనిపించడం లేదు? అన్న ప్రశ్నలు పార్టీ వర్గాల్లోనే వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసి పార్టీ అభ్యర్థుల విజయానికి పనిచేసిన స్థానిక నేతలు, కార్యకర్తలు ఇప్పుడు తమకే ప్రాధాన్యం లేకపోవడంపై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కనపెట్టి.. ఆ తర్వాత మంత్రుల చుట్టూ చేరిన నేతలకు ప్రాధాన్యం పెరిగిందనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. "గెలిపించడానికి మేము ఇంటింటికీ తిరిగాం.. ఇప్పుడు మంత్రులను కలవాలంటే కూడా నాన్‌లోకల్ నేతల అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సి వస్తోంది. మా గోడు ఎవరికి చెప్పుకోవాలి?" అంటూ కొందరు సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. మంత్రుల క్యాంపు కార్యాలయాలు, జిల్లా పర్యటనలు, అధికారిక కార్యక్రమాల్లోనూ స్థానిక నేతల కంటే బయట ప్రాంతాలకు చెందిన కొందరే ఎక్కువగా కనిపిస్తున్నారనే చర్చ సాగుతోంది. దీంతో క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన క్యాడర్‌లో అసంతృప్తి పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

**ఎన్నికల్లో వ్యతిరేకం.. ఇప్పుడు మంత్రులకు అత్యంత సన్నిహితం?**

ఇక మరో చర్చ మరింత ఆసక్తికరంగా మారింది. ఎన్నికల సమయంలో మంత్రుల విజయాన్ని కోరుకోని కొందరే ఇప్పుడు వారి చుట్టూ తిరుగుతూ అత్యంత సన్నిహితులుగా మారారనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అప్పట్లో ప్రత్యర్థి వర్గాలతో ఉన్నవారు ఇప్పుడు అధికార కేంద్రాల వద్ద కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పార్టీ మారుతూ.. రాజకీయ అవసరాలకు అనుగుణంగా శిబిరాలు మారుస్తూ వచ్చిన కొందరికి ఇప్పుడు మంత్రుల వద్ద ప్రాధాన్యం ఎందుకు పెరిగిందన్నదే అసలు ప్రశ్నగా మారింది. ఎన్నికల్లో పనిచేసినవారి కంటే.. అధికారం వచ్చాక చేరినవారికే ప్రాధాన్యమా? అన్న చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లో సాగుతోంది.

**అధికారుల వద్ద పెత్తనం.. భూ వ్యవహారాల్లోనూ జోక్యం?**

మంత్రుల చుట్టూ తిరుగుతున్న కొందరు నేతలు అధికారుల వద్ద కూడా తమ పలుకుబడిని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలో పెద్దగా రాజకీయ బలం లేకపోయినా.. మంత్రులతో సాన్నిహిత్యాన్ని చూపిస్తూ అధికారులపై ప్రభావం చూపుతున్నారనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా భూములకు సంబంధించిన వ్యవహారాల్లో కొందరు నేతలు జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రులు జిల్లాలో లేదా నియోజకవర్గంలో లేని సమయంలోనూ సంబంధిత అధికారులను కలుస్తూ పనులు చక్కబెట్టుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. మంత్రులతో సాన్నిహిత్యం చూపిస్తే చాలు.. అధికారుల వద్ద పని జరిగిపోతుందనే భావన ఏర్పడితే అది చివరకు ప్రభుత్వ ప్రతిష్ఠపైనే ప్రభావం చూపుతుందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**మంత్రులకు అసలు గోడు చేరుతోందా?**

లోకల్ నేతల అసంతృప్తికి మరో ప్రధాన కారణం.. మంత్రులకు తమ సమస్యలు నేరుగా చేరడం లేదన్న భావన. మంత్రుల చుట్టూ ఉన్నవారే సమాచారాన్ని ఫిల్టర్ చేస్తున్నారని కొందరు నాయకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నియోజకవర్గంలో పార్టీ ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు మంత్రుల దృష్టికి పూర్తిస్థాయిలో వెళ్లడం లేదనే చర్చ జరుగుతోంది. "చుట్టూ ఉన్నవాళ్లు చెప్పిందే వింటే క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఎలా ఉందో మంత్రులకు ఎలా తెలుస్తుంది?" అని కొందరు సీనియర్ నేతలు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. స్థానిక క్యాడర్‌ను దూరం పెడితే భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల నిర్వహణలో ఇబ్బందులు తప్పవని వారు హెచ్చరిస్తున్నారు.

**లోకల్ క్యాడర్ మౌనం.. రేపటి రాజకీయానికి సంకేతమా?**

పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులు, రాజకీయ అవకాశాలు, అధికారుల వద్ద పనుల విషయంలో తమకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని కొందరు స్థానిక నాయకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సొంత పార్టీ ప్రభుత్వంపై బహిరంగంగా మాట్లాడితే నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో చాలామంది మౌనంగా ఉంటున్నారనే అభిప్రాయం ఉంది. పార్టీని అంటిపెట్టుకుని ఉన్నవారికి దిక్కు లేకపోతే.. కొత్తగా వచ్చిన వారికి పెద్దపీట వేస్తే క్షేత్రస్థాయిలో క్యాడర్ మనోధైర్యం దెబ్బతినే ప్రమాదం ఉందని సీనియర్ నాయకులు అంటున్నారు. ఈ అసంతృప్తి బహిరంగ నిరసనగా మారకముందే మంత్రులు స్థానిక నాయకులతో నేరుగా మాట్లాడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రానున్న రాజకీయంలో 'లోకల్' లెక్క కీలకమే!**

ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ ఉంది. ఎన్నికల విజయాల్లో ఈ క్యాడర్ పాత్ర కీలకంగా ఉంది. అలాంటి క్యాడర్‌లోనే ఇప్పుడు అసంతృప్తి పెరుగుతోందన్న చర్చ పార్టీకి రాజకీయంగా కీలక పరిణామంగా మారింది. లోకల్ నాయకులను కలుపుకొంటారా?.. నాన్‌లోకల్ నేతల ప్రభావాన్ని తగ్గిస్తారా? అన్నది ఇప్పుడు మంత్రుల ముందున్న రాజకీయ ప్రశ్నగా మారింది. అధికారంలో ఉన్న సమయంలోనే స్థానిక క్యాడర్‌తో సమన్వయం లేకపోతే.. ఆ ప్రభావం భవిష్యత్ రాజకీయ పరిణామాల్లో కనిపించే అవకాశం ఉందన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. మొత్తంగా మంత్రుల చుట్టూ పెరుగుతున్న నాన్‌లోకల్ వలయం.. లోకల్ క్యాడర్‌లో పెరుగుతున్న అసంతృప్తి ఖమ్మం కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయ సమీకరణాలపై కొత్త చర్చకు తెరలేపింది. ఈ అసంతృప్తిని మంత్రులు ఎలా చల్లారుస్తారన్నదే ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో ఆసక్తికర అంశంగా మారింది.

# కొత్త పత్తి కొనుగోళ్లకు శ్రీకారం

- వరంగల్ మార్కెట్ యార్డులో తొలి బస్తాకు రూ.8775 ధర
- ఎం.వి.తండా రైతు జి.రమణకు సన్మానం
- మార్కెట్ యార్డును పరిశీలించిన సీపీ ఎన్.శ్వేత

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వ్యవసాయ మార్కెట్ కమిటీ వరంగల్ పత్తి యార్డులో కొత్త పత్తి ప్రైవేట్ కొనుగోళ్లకు గురువారం శ్రీకారం చుట్టారు. ఉదయం 9 గంటలకు నిర్వహించిన ముహూర్త కార్యక్రమంలో జెండా పాట నిర్వహించి తొలి పత్తి బస్తాకు రూ.8775 ధర నిర్ణయించారు. నల్లబెల్లి మండలం ఎం.వి.తండాకు చెందిన రైతు జి.రమణ తీసుకొచ్చిన పత్తికి ఈ ధర పలికింది. దీంతో రైతును చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. అనంతరం మధ్యాహ్నం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మార్కెట్ యార్డును సందర్శించారు. యార్డులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, వాటి పనితీరును పరిశీలించారు. మార్కెట్‌కు వస్తున్న మిర్చి రకాలు, వాటి ధరలను అడిగి తెలుసుకున్నారు. సీజన్‌లో తలెత్తే శాంతిభద్రతల సమస్యలపై అధికారులను ఆరా తీశారు. కార్యక్రమంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, వైస్‌చైర్మన్ బండి జనార్ధన్, కమిటీ సభ్యులు గజ్జల శ్యాం, దుగ్యాల గోపాల్‌రావు, కందుకూరి పూర్ణచందర్, ఛాంబర్ అధ్యక్షుడు బొమ్మనేని రవీందర్‌రెడ్డి, కార్యదర్శి మడురి వేదప్రకాష్, కాటన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

- నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం పూర్తి చేయాలి
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, సీఎంవో ఉన్నతాధికారులు
- పనుల పురోగతిపై ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- మౌలిక వసతులపై అధికారులకు సూచనలు

**కాకతీయ, వరంగల్:** వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ప్రభుత్వ ఉన్నతాధికారులు సూచించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ వికాస్‌రాజ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, సీఎంవో కార్యదర్శి కె.మాణిక్‌రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ శుక్రవారం ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతి, వివిధ విభాగాల నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన పనులను పరిశీలించి నాణ్యతను సమీక్షించారు. మిగిలిన పనులను ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలోని ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

**అత్యాధునిక వైద్య సేవలకు ఏర్పాట్లు**

ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా, పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. మౌలిక వసతులు, విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాల్లో ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ఉన్నతాధికారులకు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మేక్ ఇన్ ఇండియా.. 12 ఏళ్ల ప్రస్థానం!

- తయారీ.. పెట్టుబడులు.. ఎగుమతుల్లో మార్పు
- ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్ దిశగా అడుగులు
- పీఎల్ఐతో రూ.2.40 లక్షల కోట్ల పెట్టుబడులు
- ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో ఏడు రెట్ల వృద్ధి
- మొబైల్ తయారీలో భారీగా పెరిగిన దేశీయ సామర్థ్యం
- కాంగ్రెస్ వాదనకు.. కేంద్రం గణాంకాలతో సమాధానం

**కాకతీయ,నేషనల్ డెస్క్ :** భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 2014 సెప్టెంబర్ 25న ప్రారంభమైన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం 12 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కార్యక్రమం ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ.. తయారీ, పెట్టుబడులు, ఎగుమతులు, మౌలిక వసతులు, ఆవిష్కరణల రంగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. భారత్‌లో మరింత తయారీ, మరింత పెట్టుబడి, మరింత ఎగుమతులు జరగాలన్న లక్ష్యంతో మేక్ ఇన్ ఇండియా కొనసాగుతోందని తెలిపారు. అయితే కార్యక్రమం ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**12 ఏళ్లలో మారిన తయారీ చిత్రం**

మేక్ ఇన్ ఇండియా ప్రారంభ సమయంలో దేశీయ తయారీని పెంచడంతోపాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక వసతులను బలోపేతం చేయడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించారు. కేంద్రం ప్రకారం.. ఈ కార్యక్రమం ఇప్పుడు కేవలం దేశీయ అవసరాలకు ఉత్పత్తి చేసే విధానాన్ని దాటి ప్రపంచ మార్కెట్లకు సరఫరా చేసే సామర్థ్యాన్ని పెంచే దిశగా విస్తరించింది. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఫార్మా, స్టీల్, రైల్వేలు, రక్షణ రంగాల్లో ఉత్పత్తి సామర్థ్యం పెరిగిందని ప్రభుత్వం పేర్కొంటోంది.

**27 రంగాలపై మేక్ ఇన్ ఇండియా 2.0**

ప్రస్తుతం మేక్ ఇన్ ఇండియా 2.0 కింద తయారీతోపాటు సేవల రంగాలను కలిపి మొత్తం 27 రంగాలపై దృష్టి పెట్టారు. దేశీయ ఉత్పత్తి వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో భారత్ భాగస్వామ్యాన్ని పెంచేలా విధానాలను రూపొందిస్తున్నట్లు కేంద్రం చెబుతోంది. సెమీకండక్టర్లు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ భాగాలు, సౌర పరికరాలు, ఫార్మా, ఆటోమొబైల్ రంగాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తోంది.

మేక్ ఇన్ ఇండియా ప్రయాణంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు కీలకంగా మారాయని కేంద్రం పేర్కొంటోంది. 14 కీలక రంగాల్లో అమలవుతున్న పీఎల్ఐ పథకాల కింద 2026 మార్చి నాటికి రూ.2.40 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపింది. రూ.22.66 లక్షల కోట్లకు పైగా ఉత్పత్తి, అమ్మకాలు నమోదయ్యాయని.. రూ.15.20 లక్షల కోట్లకు పైగా ఎగుమతులు జరిగినట్లు కేంద్ర గణాంకాలు పేర్కొంటున్నాయి. ప్రత్యక్ష, పరోక్షంగా 14.15 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు ప్రభుత్వం చెబుతోంది.

**ఎలక్ట్రానిక్స్‌లో ఏడు రెట్ల పెరుగుదల**

ఎలక్ట్రానిక్స్ రంగాన్ని మేక్ ఇన్ ఇండియా ప్రభావానికి ప్రధాన ఉదాహరణగా కేంద్రం చూపుతోంది. 2014-15లో దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి విలువ సుమారు రూ.1.90 లక్షల కోట్లు ఉండగా.. 2025-26లో రూ.13.11 లక్షల కోట్లకు చేరిందని తెలిపింది. అంటే దాదాపు ఏడు రెట్లు పెరిగినట్లు పేర్కొంది. ఇదే సమయంలో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.38 వేల కోట్ల నుంచి రూ.4.24 లక్షల కోట్లకు పెరిగాయని కేంద్రం వెల్లడించింది. మొబైల్ ఫోన్ తయారీ రంగంలోనూ గణనీయమైన మార్పు వచ్చిందని ప్రభుత్వం పేర్కొంది. 2014-15లో దేశంలో సుమారు రూ.18 వేల కోట్ల విలువైన మొబైల్ ఫోన్లు తయారైతే.. 2025-26లో ఆ విలువ రూ.6.27 లక్షల కోట్లకు చేరింది. మొబైల్ ఫోన్ ఎగుమతులు సైతం సుమారు రూ.1,500 కోట్ల నుంచి రూ.2.59 లక్షల కోట్లకు పెరిగినట్లు కేంద్రం తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో వినియోగించే మొబైల్ ఫోన్లలో 99.2 శాతం దేశంలోనే తయారవుతున్నాయని పేర్కొంది.

**కాంగ్రెస్ భిన్న వాదన**

మేక్ ఇన్ ఇండియా విజయాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తయారీ రంగ వృద్ధి మొత్తం ఆర్థిక వ్యవస్థ వృద్ధితో పోలిస్తే అనేక సందర్భాల్లో తక్కువగానే ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ పెట్టుబడుల్లో భారీ పెరుగుదల కనిపించలేదని, విస్తృత స్థాయిలో ఉద్యోగాల కల్పన కూడా జరగలేదని కాంగ్రెస్ వాదిస్తోంది. తయారీ రంగ గణాంకాలను పరిశీలిస్తే మేక్ ఇన్ ఇండియా కారణంగా ప్రత్యేకంగా కనిపించే అదనపు వృద్ధి ఇంకా స్పష్టంగా కనిపించడం లేదని జైరాం రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. కేంద్రం మాత్రం తయారీ సామర్థ్యంతోపాటు ఎగుమతుల పెంపునకు ప్రాధాన్యం ఇస్తోంది. వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ ప్రకారం.. ఒకప్పుడు దేశీయ మార్కెట్ అవసరాల కోసం ఉత్పత్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి ఉండగా.. ఇప్పుడు ప్రపంచ మార్కెట్ల కోసం ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పెంచుకుంటున్న దశకు భారత్ చేరుకుంది. స్టార్టప్ వ్యవస్థాపకులు, పారిశ్రామికవేత్తలు, తయారీదారులు, ఆవిష్కర్తలు, ఎగుమతిదారుల్లో భారత్ తయారు చేయగలదు, ఆవిష్కరించగలదు, ప్రపంచంతో పోటీ పడగలదనే నమ్మకం పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా 12 ఏళ్ల ప్రయాణంలో కేంద్రం వెల్లడిస్తున్న గణాంకాలు ఒక వైపు.. తయారీ రంగ వృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ లేవనెత్తుతున్న ప్రశ్నలు మరోవైపు ఉన్నాయి. రానున్న కాలంలో ప్రపంచ తయారీ సరఫరా గొలుసుల్లో భారత్ స్థానం ఎంత బలపడుతుందన్నది ఈ కార్యక్రమం తదుపరి దశకు కీలకంగా మారనుంది.

**ప్రపంచ మార్కెట్లే లక్ష్యం**

దేశీయ మార్కెట్ అవసరాలకే పరిమితమైన తయారీ వ్యవస్థను ప్రపంచ సరఫరా గొలుసులో కీలక భాగస్వామిగా మార్చడమే తదుపరి లక్ష్యమని కేంద్రం చెబుతోంది. సెమీకండక్టర్ పరిశ్రమలో పెట్టుబడులు, ఎలక్ట్రానిక్ భాగాల తయారీ, సౌర పరికరాలు, ఫార్మా, ఆటో రంగాల్లో సామర్థ్య విస్తరణకు చర్యలు కొనసాగుతున్నాయి. భారత్‌లో తయారు చేసి ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసే సామర్థ్యాన్ని మరింత పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. మేక్ ఇన్ ఇండియా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ.. భారత్‌లో మరింత తయారీ, మరింత పెట్టుబడి, మరింత ఎగుమతులు జరగాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. మౌలిక వసతులు, వ్యాపార అవకాశాలు, ఆవిష్కరణలకు ఈ కార్యక్రమం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. వివిధ రంగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.

# పేదల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు

- 50 కుటుంబాలకు ఇంది రమ్మ ఇళ్ల పట్టాలు
- 78 మందికి రూ.24.12 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు



**కాకతీయ, చందుర్తి :** పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు అందించి ఆత్మ గౌరవంతో జీవించేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన 50 పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించుకోవాలని సూచించారు. అనంతరం 78 మంది లబ్ధిదారులకు రూ.24.12 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## లింగంపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**కాకతీయ, చందుర్తి:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటకు చెందిన నలుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం అందజేశారు. కముటం లక్ష్మీరాజంకు రూ.32,000, మారుపాక వెంకటేష్‌కు రూ.27,500, మారుపాక దేవవ్వకు రూ.17,500, పురుగుల సంధ్యకు రూ.60,000 చొప్పున మొత్తం రూ.1.37 లక్షల విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు ఇందూరి రాజు, కాంగ్రెస్ నాయకులు తర్రె గణేష్, ఆనంద్, గుడిసె గణేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గూడూరు జయశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలి



**కాకతీయ, హనుమకొండ:** హనుమకొండ రాంనగర్‌కు చెందిన గూడూరు జయశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజాసంఘాల నేతలు చుంచు రాజేందర్, మాదాసి సురేష్, కేడల ప్రసాద్, అంకేశ్వరపు రామచందర్‌రావు డిమాండ్ చేశారు. ఇంట్లో నిరసన చేపట్టి నాలుగో రోజుకు చేరిన జయశ్రీకి వారు మద్దతు తెలిపారు. గతంలో అత్త మీరాబాయి నోటరీ ద్వారా రాసిచ్చిన ఇల్లు, ఆస్తులు ఇప్పించాలని, ఆమెను బంధించిన వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే, సీపీ, కలెక్టర్ స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మంద వీరాస్వామి, మేడ స్వామి మాదిగ, మోరే ఐలయ్య, గోల్కొండ శ్రీనివాస్, శ్రీరాం మల్లేశం పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలి

- ఒత్తిడి లేకుండా ఆరోగ్యంగా ఉండేందుకు యోగ దోహదం
- హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి




**కాకతీయ, హనుమకొండ :** ఆరోగ్య ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగ సాధన చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, పర్యాటక శాఖ నోడల్ అధికారి ఎన్. రవి సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో యోగ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్. రవి అధికారులు, యోగా సాధకులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని, ఆధునిక జీవనశైలిలో ఒత్తిడిని తగ్గించేందుకు యోగ దోహదపడుతుందని తెలిపారు. యోగ ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఆయుష్ శాఖ అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు, యోగ సాధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇనుగాల అమరేందర్‌రెడ్డికి ఘన నివాళి



**కాకతీయ, హైదరాబాద్ :** దివంగత ఇనగాల అమరేందర్‌రెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి తండ్రి అమరేందర్‌రెడ్డి 2002లో మృతి చెందారు. వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని వారి నివాసంలో కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమరేందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ఆయన సేవలను స్మరించుకున్నారు.

## బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా రేణుక నియామకం



**కాకతీయ, నెల్లికుదురు:** భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని నైనాల గ్రామానికి చెందిన తోట రేణుక నియమితులయ్యారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర, జిల్లా బిజెపి అధ్యక్షులు వల్ల వెంకటేశ్వర్లు మహిళ మోర్చా అధ్యక్షురాలు సరోజన లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ మహిళలను పెద్ద సంఖ్యలో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తానని, మహిళా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

# రూ.6 వేల కోసం.. కంప్యూటర్ రూమ్‌కు తాళం!

- కోట్ల ఆదాయం వచ్చే మార్కెట్‌లో ఇదేం దుస్థితి?
- నెల రోజులుగా మూతపడిన కంప్యూటర్ రూమ్
- ఏడాదిగా రూ.60 లక్షల శానిటేషన్ బిల్లులు పెండింగ్
- పాలకులు, అధికారుల తీరుపై రైతులు.. వ్యాపారుల ఆగ్రహం





**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా పేరున్న ఎనుమాముల మార్కెట్‌లో నిధుల కొరత, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోజూ లక్షల రూపాయల లావాదేవీలు.. ఏటా కోట్ల రూపాయల ఆదాయం వచ్చే మార్కెట్‌లో కేవలం రూ.6 వేల పాత బకాయి చెల్లించలేక కంప్యూటర్ రూమ్‌కు నెల రోజులుగా తాళం పడటం చర్చనీయాంశంగా మారింది. మార్కెట్ నిర్వహణలో కీలకమైన కంప్యూటర్ వ్యవస్థ పనిచేయకపోవడంతో కూరగాయల మార్కెట్ లావాదేవీల లెక్కలు, రసీదులు, ఇతర డేటా నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరంగల్ నగరంలోని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని కంప్యూటర్ రూమ్ నెల రోజులుగా తెరుచుకోవడం లేదు. గతంలో కంప్యూటర్ రిపేర్ చేసిన టెక్నీషియన్‌కు చెల్లించాల్సిన రూ.6 వేల బకాయి ఇప్పటికీ ఇవ్వలేదని సమాచారం. ఆ మొత్తం చెల్లిస్తేనే కంప్యూటర్‌ను తిరిగి బాగు చేస్తానని టెక్నీషియన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోట్ల రూపాయల ఆదాయం వచ్చే మార్కెట్‌లో చిన్న మొత్తం కోసం కీలకమైన కంప్యూటర్ వ్యవస్థ నిలిచిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పండ్ల మార్కెట్ కంప్యూటర్‌పైనే ఆధారం**

కూరగాయల మార్కెట్ కంప్యూటర్ రూమ్ మూతపడటంతో అక్కడి లావాదేవీలకు సంబంధించిన పనులను పక్కనే ఉన్న పండ్ల మార్కెట్‌లోని కంప్యూటర్ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకే కంప్యూటర్‌పై అదనపు భారం పడటంతో రోజువారీ లెక్కలు, రసీదుల జారీ, కిరాయిల వసూళ్ల నమోదు వంటి పనుల్లో జాప్యం ఏర్పడుతున్నట్లు సమాచారం. మార్కెట్‌లో జరిగే లావాదేవీలకు సంబంధించిన సమాచారం సకాలంలో అందుబాటులో లేకపోవడం పారదర్శకతపైనా ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఏ వ్యాపారి ఎంత చెల్లించారు? ఏ రోజు ఎంత ఆదాయం వచ్చింది? అనే వివరాలను వెంటనే పరిశీలించే పరిస్థితి లేకపోవడం నిర్వహణ లోపాలను ఎత్తిచూపుతోంది. మార్కెట్‌లో అత్యవసర మరమ్మతులు, చిన్నచిన్న పనులు చేయించేందుకు గతంలో అధికారులు సొంతంగా డబ్బులు ఖర్చు చేసినట్లు సమాచారం. ఆ పనులకు సంబంధించిన బిల్లులు కూడా చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తోంది. దీంతో అత్యవసర పనులు వచ్చిన ప్రతిసారీ సొంతంగా డబ్బులు పెట్టాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఖర్చు చేసిన మొత్తాలు తిరిగి రాకపోవడంతో కొత్త పనులకు డబ్బులు పెట్టేందుకు సిబ్బంది వెనుకంజ వేస్తున్న పరిస్థితి ఏర్పడింది.

**ఏడాదిగా రూ.60 లక్షల శానిటేషన్ బిల్లులు**

మార్కెట్ నిర్వహణలో మరో కీలక సమస్య శానిటేషన్ బిల్లుల పెండింగ్. సుమారు ఏడాది కాలంగా రూ.60 లక్షల వరకు పారిశుద్ధ్య బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. మార్కెట్‌లో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు కూలీలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వారికి కాంట్రాక్టర్లు రోజువారీగా చెల్లింపులు చేయాల్సి వస్తుంది. అయితే బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. దీంతో మార్కెట్‌లో పారిశుద్ధ్య పనులు నిర్వహించే కాంట్రాక్టర్లు కొత్త పనులకు ముందుకు రావడానికి కూడా ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బిల్లులు ఎప్పుడు వస్తాయో స్పష్టత లేకపోవడంతో కొత్త టెండర్లలో పాల్గొనేందుకు కూడా కొందరు వెనుకాడుతున్నట్లు సమాచారం. ఎనుమాముల మార్కెట్ ద్వారా రోజూ భారీగా లావాదేవీలు జరుగుతున్నాయి. మార్కెట్ ఫీజులు, కిరాయిలు, ఇతర మార్గాల్లో గణనీయమైన ఆదాయం సమకూరుతున్నప్పటికీ రూ.6 వేల బకాయిని చెల్లించలేని పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. మార్కెట్‌కు వచ్చే ఆదాయం ఎక్కడికి వెళ్తోంది? నిర్వహణకు అవసరమైన చిన్నచిన్న చెల్లింపులు కూడా ఎందుకు నిలిచిపోతున్నాయి? ఏడాదిగా రూ.60 లక్షల శానిటేషన్ బిల్లులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? అనే ప్రశ్నలు రైతులు, వ్యాపార వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. మార్కెట్ నిర్వహణలో నిధుల లభ్యత, బిల్లుల చెల్లింపు, రోజువారీ ఆదాయ వ్యయాలపై ఉన్నతాధికారులు సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

**పాలకవర్గం ఏం చేస్తోంది?**

ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా పేరున్న ఎనుమాములలో మౌలిక నిర్వహణకు సంబంధించిన సమస్యలు ఈ స్థాయికి చేరడం మార్కెట్ పాలనపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. కంప్యూటర్ రూమ్ నెల రోజులుగా మూతపడినా సమస్య పరిష్కారం కాకపోవడం.. శానిటేషన్ బిల్లులు ఏడాది పాటు పెండింగ్‌లో ఉండటం.. అత్యవసర పనులకు అధికారులు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి రావడం వంటి అంశాలు మార్కెట్ యంత్రాంగం పనితీరును ప్రశ్నించేలా చేస్తున్నాయి. మార్కెట్‌కు వచ్చే రైతులు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే కంప్యూటర్ వ్యవస్థను పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులను పరిష్కరించాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు. మార్కెటింగ్ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మార్కెట్ ఆదాయం-వ్యయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, నిధుల కొరతకు అసలు కారణాలను వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు.

# గురుకులాల్లో కనీస వసతులు కరువు



- విద్యార్థినులకు భద్రత ఉండటం లేదు
- 14 మంది బాలికలను ఎలుకలు కరిచినా పట్టని అధికారుల తీరు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పాలకుర్తి బాలికల గురుకుల ఘటనపై మాజీమంత్రి ఎర్రబెల్లి ఆగ్రహం
- విద్యార్థినులను పరామర్శించేందుకు వెళ్లగా అడ్డుకున్న పోలీసులు

**కాకతీయ, వరంగల్ బ్యూరో :** గురుకుల పాఠశాలలో 14 మంది బాలికలను ఎలుకలు కరిచే వరకు అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. విద్యార్థినుల పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పేందుకు పాలకుర్తి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లిన తనను పోలీసులు గేటు వద్దే అడ్డుకోవడం దుర్మార్గపు పాలనకు నిదర్శనమని విమర్శించారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచినట్లు ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. విద్యార్థినులను పరామర్శించేందుకు వెళ్లగా పోలీసులు లోపలికి అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి గేటు ఎదుట నిరసన చేపట్టారు. సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థినుల పరిస్థితిని వివరించారు.

**తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదా?**

విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటనపై వారి తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇవ్వలేదని ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదన్నారు. గతంలో ఇదే పాఠశాల వాచ్‌మెన్‌ను పాము కరిచిన ఘటన కూడా జరిగిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పక్కనే గురుకులం ఉన్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఏడాదికి రెండుసార్లు గురుకులాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని కనీస వసతులు కల్పించేవాడినని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అధికారులు వెంటనే విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన వైద్యం అందించాలని, గురుకులంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ఎలుకల బెడదను పూర్తిగా నివారించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనకు బీఆర్ఎస్ మండల శ్రేణులు మద్దతు తెలిపారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన గండ్ర

**కాకతీయ, భూపాలపల్లి:** రేగొండ మండలం పెద్దంపల్లికి చెందిన నవిండ్ల శంకర్, కొత్తపల్లి గోరి మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన కోడూరి రాజమౌళిగౌడ్, దామరంచపల్లికి చెందిన జూపాక ప్రసాద్ ఇటీవల మృతి చెందారు. శుక్రవారం వారి ఇళ్లకు వెళ్లిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులు ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

- అక్టోబర్ 1 నుంచి స్లాబ్ విస్తీర్ణంపై పరిమితి
- 750 చదరపు అడుగులకు మించి నిర్మించరాదు
- నెల్లికుదురు ఎంపీడీవో సింగారపు కుమార్ సూచన



**కాకతీయ, నెల్లికుదురు :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో సింగారపు కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూఫ్ లెవల్ దశకు చేరుకున్న లబ్ధిదారులు స్లాబ్ నిర్మాణానికి ముందు ప్రభుత్వ నిబంధనలు పరిశీలించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు జీవో ఆర్‌టీ నంబర్ 495, టీఆర్ అండ్ బీ (హౌసింగ్) శాఖ, తేదీ 19.09.2026 ప్రకారం.. జీవో ఆర్‌టీ నంబర్ 352, తేదీ 27.06.2026లో నిర్దేశించిన స్లాబ్ విస్తీర్ణ పరిమితుల అమలును సెప్టెంబరు 30 వరకు వాయిదా వేసినట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి నిబంధనలు కచ్చితంగా అమల్లోకి వస్తాయన్నారు. ఆ తేదీ నుంచి ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ విస్తీర్ణం 750 చదరపు అడుగులకు మించకూడదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడితే అందుకు సంబంధించిన పరిణామాలకు లబ్ధిదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేసి, నిబంధనలు అమలయ్యేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

# కేంద్రం వాటా దాచిపెట్టి.. ఇప్పుడు మాటల గారడీనా?

- ఇందిరమ్మ ఇళ్ల బిల్లులపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- కేంద్రం, రాష్ట్రం వాటాల వివరాలు ప్రజలకు వెల్లడించాలి
- బీజేపీ గీసుగొండ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్ డిమాండ్



**కాకతీయ, గీసుగొండ :** ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల పెండింగ్‌పై వస్తున్న విమర్శల నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ నాయకులు కేంద్రం వాటా పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీ గీసుగొండ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్ ఆరోపించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి కేంద్రం ఇళ్ల కేటాయింపులు, ఆర్థిక సహాయం అందిస్తున్న విషయాన్ని ఇప్పటివరకు ప్రజలకు ఎందుకు స్పష్టంగా చెప్పలేదని ప్రశ్నించారు. కేంద్రం నుంచి నిధులు వస్తున్న వాస్తవాన్ని దాచిపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రచారం చేసి లబ్ధిదారులను ప్రభావితం చేశారని ఆరోపించారు. ఇప్పుడు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కేంద్రం వాటా పేరుతో వివరణలు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసి మరిన్ని ఇళ్లు మంజూరు చేయాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. కేంద్రం, రాష్ట్రం వాటాలు ఎంతన్నది జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో అధికారులు ప్రజలకు అధికారికంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిధులను పక్కదారి పట్టించకుండా ఇళ్ల నిర్మాణానికే వినియోగించి, లబ్ధిదారుల ఖాతాల్లో పెండింగ్ బిల్లులను వెంటనే జమ చేయాలని రవికుమార్ కోరారు.

# సీరత్ ఎక్స్‌పోకు ఎంఐఎం సేవలు



- మూడు రోజులపాటు సీరత్ ఎక్స్‌పో-2026 నిర్వహణ
- 30 వేల మందికి తాగునీటి వసతి
- ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ వెల్లడి

**కాకతీయ, కరీంనగర్:** జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీరత్ ఎక్స్‌పో2026కు ఎంఐఎం పార్టీ తరఫున సేవలు అందిస్తామని ఎంఐఎం కరీంనగర్ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం సర్కస్ గ్రౌండ్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే మైదానంలో నిర్వహించిన ఎక్స్‌పో ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మూడు రోజులపాటు నిర్వహించే సీరత్ ఎక్స్‌పోలో ఇస్లాం గురించి అవగాహన కల్పించే స్టాల్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ఎక్స్‌పోకు వచ్చే సుమారు 30 వేల మందికి ఎంఐఎం కరీంనగర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి వసతి కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ ఊట్కూరు నరేందర్‌రెడ్డి, జమాతే ఇస్లామీ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్‌ఖాన్, లక్ష్ విద్యాసంస్థల ఛైర్మన్ ముష్తాఖ్ అహ్మద్, ముఫ్తి నదీమోద్దీన్, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, షోయబ్ లతీఫీ, ఖైరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266